ప్రజాశక్తి

మంగళవారం 31 అక్టోబర్ 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

15న చలో విజయవాడ

- ప్రజా రక్షణభేరిని విజయవంతం చేయాలి
- సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-భట్టిప్రోలు

లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం ప్రజారక్షణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా రాష్ట్రం విడిపోయిన నాటి నుండి ఏపీకి తీవ్రనష్టం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా గానీ, విభజన చట్టంలోని హామీలను గానీ ఏ ఒక్కటీ అమలుపరచలేదని, అయినా కేంద్రానికి నేటి వైసిపి ప్రభుత్వం గానీ, టిడిపి గానీ, జనసేన గానీ వత్తాసు పలుకుతూ.. ప్రజాసమస్యలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ విషయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు సిపిఎం బస్సు యాత్రను చేపట్టిందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలు గానీ, ఉపాధి గానీ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం వ్యవసాయ రంగానికి సాగునీరు కూడా అందక రైతులు కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను గుర్తించి.. వాటిని కరపత్రాల రూపంలో ప్రజలకు అందజేస్తున్నామన్నారు. బస్సు యాత్ర నవంబర్ 8న భట్టిప్రోలుకు వస్తుందని, యాత్రకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నవంబర్ 15న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు సిపిఎం జాతీయ నాయకులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ▶ 2లో

వెంచర్‌కు వెళ్లే రహదారి కబ్జా..

- బయటకు రాకుండా గోడ నిర్మాణం చేసిన వైసిపి నేత
- వెంగముక్కపాలెం వద్ద 25 ప్లాట్లకు వెళ్లే దారి లేక యజమానుల అవస్థలు
- గడపగడపకూ కార్యక్రమంలో బాలినేనికి అర్జీ
- ఎస్పీని కలిసి కబ్జాపై ఫిర్యాదు చేసిన బాధితులు



వెంచర్‌కు వెళ్లే రోడ్డును ఆక్రమించిన దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జాతీయరహదారి నుంచి వెంగముక్కపాలెం వెళ్లే రోడ్డులో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు సమీపంలో ఓ వెంచర్‌కు వెళ్లే రహదారినే వైసిపి నేత ఒకరు కబ్జా చేశారు. సుమారు 25 ప్లాట్లకు వేసిన రహదారి అది. అందులోకి వెళ్లకుండా దానికి ఏర్పాటుచేసిన రోడ్డునే ఆక్రమించారు. లోపలకు వెళ్లే మార్గం లేదు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికీ బాధితులు తమ గోడు చెప్పుకున్నారు. పరిష్కారం కాలేదు. రెవెన్యూ అధికారులకూ చెప్పినా వినలేదు. డీఎస్పీకీ ఫిర్యాదు చేశారు. వారికి లోపలకు వెళ్లే మార్గం మాత్రం కనిపించలేదు. ఇప్పుడు ఏర్పాటు చేసిన సిట్‌ను కలిసేందుకు ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఏఎస్పీని కలిశారు. వారి సమస్య విన్న ఏఎస్పీ ఈ విషయం ఎస్పీ వద్దకు వెళ్లాల్సి ఉందని సూచించారు. ఆయనే స్వయంగా బాధితులను ఎస్పీ వద్దకు పంపారు. అన్ని వివరాలూ విన్న ఎస్పీ మల్లికాగర్గ్ స్పందించి వెంటనే మీ సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారని బాధితులు బత్తుల వెంకారెడ్డి ప్రజాశక్తికి చెప్పారు. ఈ కబ్జాకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..

వెంగముక్కపాలెం వెళ్లే రహదారి ప్రారంభంలోనే సర్వే నెంబరు 103బై1, 103బై1బిలో రెండు ఎకరాలా నాలుగు సెంట్లలో సుమారు 25 ప్లాట్లను వేశారు. 2004లో రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటికి మామిడిపాలెం నుంచి వెంగముక్కపాలెం వెళ్లే రహదారి హద్దుగా ఉంది. ఈ వెంచర్‌లో వేసిన ప్లాట్లకు బయటకు రావాలంటే ఒక రోడ్డు ఉంది. ఇది వెంగముక్కపాలెం రహదారిలో కలుస్తుంది. అయితే కరోనా సమయంలో వైసిపి నేత యనాదిరావు అనే వ్యక్తి, అతని అనుచరులు కలిసి ఈ రోడ్డును, దాని మార్జిన్‌ను ఆక్రమించారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్లాట్లకు వేసిన రోడ్డును ఎందుకు ఆక్రమించారని అడిగితే మార్జిన్‌లో తమకు డికే పట్టాలున్నాయంటూ బెదిరించారని బాధితులు తెలిపారు. మీ ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకోండంటూ బెదిరింపులకు దిగారని ఎస్పీకి వివరించారు. అంతేకాకుండా కబ్జాదారులు ఆ రోడ్డుకు అడ్డంగా గోడ కట్టారు. లోపలకు వెళ్లేమార్గం లేదు. 25 ప్లాట్లకు దారి మూసుకుపోయింది. ఇంకోమార్గం కూడా లేదు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా అధికారపార్టీ నేత ఆక్రమణదారుడిగా ఉన్నందున ఈ సమస్యను ▶ 2లో

మేత కరువై..పశుపోషణ భారమై..

- దడ పుట్టిస్తున్న గడ్డి ధరలు.!
- మేత కోసం జీవాల ఇక్కట్లు
- గతి లేక ఎండిన వేపను తింటున్న పశువులు
- ఆందోళనలో పాడి రైతులు



దొనకొండలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న వేప కొమ్మలు కొట్టేయడంతో.. అక్కడ ఎండిన వేపాకులనే తింటున్న పశువులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం, దొనకొండ

వర్షాభావంతో పంటలు సరిగ్గా పండక రైతులను కరువు వెంటాడుతోంది. జీవనోపాధికి పెంచుకుంటున్న పశువులకూ మేత కరువైంది. పశుగ్రాసం కూడా దొరికే పరిస్థితి లేదు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల కాపలాదారులు జీవాలను మేత కోసం ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. పాడి పరిశ్రమ పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారింది. పశు పోషణపై ఆధారపడిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొనకొండలో పశుగ్రాసం లేక గేదెలు ఎండిన వేపాకులు తింటూ ఆకలి తీర్చుకుంటున్నాయి.. సమస్య తీవ్రతకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే..

వరుణుడు ముఖం చాటేయడంతో చెరువులు, వాగులు, కుంటలు ఎండి.. సాగుభూములు బీటలు వారాయి. భూగర్భజలాలు అడుగంటి బోరుబావులు ఒట్టిపోతున్నాయి. భూగర్భజల మట్టం 800 అడుగుల లోతుకు పడిపోవడంతో ఉన్న బోర్లకు నీరందక, కొత్త బోరు వేసినప్పటికీ నీరు పడక, పంటలు ఎండిపోతున్నాయి. రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు వ్యవసాయం కలిసి రావడం లేదని, పాడిని నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. పచ్చిమేత కనిపించకుండా పోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రాసం కొరతతో మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. ఐదు లీటర్లలోపు పాలిచ్చే గేదెలు కూడా ఒట్టిపోతున్నాయి. ఐదు నుంచి 12 లీటర్లు వరకు పాలిచ్చే గేదెలు 4, 5 లీటర్లు పాలివ్వడానికి బావురుమంటున్నాయి.

కానరాని పచ్చగడ్డి..

పచ్చగా ఉండే పంట పొలాలు ఎండిపోవడంతో పచ్చగడ్డి కానరాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఎండుగడ్డికి రెక్కలొచ్చాయి. ఎండుగడ్డి కొనుగోలు చేసేందుకు వెళ్లిన రైతులు ఇతర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, లారీల్లో అమ్మకానికి తీసుకొస్తున్న ఎండుగడ్డిని వ్యాపారులు చెప్పే ధరలు విని, నోరెళ్లబెట్టే పరిస్థితి ఏర్పడింది. కృష్ణా జిల్లా గుడివాడ నుంచి తీసుకువస్తున్న ట్రాక్టర్ వరిగడ్డి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ధర పలుకుతోంది. లారీ వరిగడ్డి రూ.36 వేల నుంచి రూ.45 వేల వరకు పలుకుతుంది. ట్రాక్టర్ గడ్డి కొనుగోలు చేసి, గ్రామాలకు తరలించేందుకు రైతులకు ▶ 2లో



వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ఏ పంటా చేతికొచ్చేలా లేదు..

వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన రైతుసంఘం ▶ 2లో



పాకల సముద్రతీరంలో ఉన్న కడలూరు బోట్లు

కడలూరు బోట్ల హల్‌చల్ ▶ 5లో

ఏ పంటా చేతికొచ్చేలా లేదు..

- ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

- పలు గ్రామాల్లో పంటల పరిశీలన

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

వర్షాభావం కారణంగా ఏ ఒక్క పంట కూడా రైతు చేతికి వచ్చే పరిస్థితి లేదని, హనుమంతునిపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు గ్రామాలలో రైతుల పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, పిల్లి తిప్పారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలపై ఆధారపడి రైతులు పంటలు వేస్తే వర్షాలు సకాలంలో రాకపోవడం వలన ఎండిపోతున్నాయని అన్నారు. గతంలో వేసిన పంటల్లో ఎదుగుదల లేదని, ఇలాంటి పరిస్థితుల్లో కరువు నివారణ చర్యల్లో భాగంగా పంటలేసిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని హనుమంతునిపాడు మోరవారిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, హాజీపురం, నీలకంఠాపురం, కనిగిరి మండలం శ్రీరంగాపురం తదితర గ్రామాలలో పంట పొలాల్లోకి వెళ్లి పరిశీలించారు. మినుము, బొబ్బర్లు, అలసందలు, సెనగ, మిరప, జామకాయ తోటలు, పొగాకు పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండిపోతున్న పంటలను మీడియాకు చూపించి వివరించారు. పొగాకు రైతులు గత రెండు నెలల క్రితం వేసిన మొక్క ఎక్కి రాకపోవడంతో తిరిగి వాటిని దున్నేసి మళ్లీ కిలోమీటర్ల కొద్దీ పైపులైన్లు వేసి నీళ్లు పెట్టి మొక్కలు తిరిగి వేస్తున్నారని, దీనివల్ల పెద్ద మొత్తంలో రైతులు పెట్టుబడులు పెరిగాయని వివరించారు. ఆహార ధాన్యపు పంటల్లో కనీసం విత్తినటువంటి విత్తనాల ఖరీదు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. మారెళ్లవారిపల్లెకు చెందిన కాటినేని చెన్నకేశవులకు సంబంధించిన ఏడు ఎకరాల మిరప తోటను, తాటిరెడ్డి వెంకట్ రెడ్డికి చెందిన వేరుశెనగ తోటను, మారంరెడ్డి నారాయణరెడ్డికి చెందిన జామ తోటను ఇండ్ల ఓబులకు చెందినటువంటి 14 ఎకరాల పొగాకు తోటను ఇలా అనేక మంది రైతుల పంట పొలాలను పరిశీలించామని తెలిపారు. ఎక్కడ చూసినా వర్షాలు లేక బోర్లలో నీళ్లు రాక తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. రాబోయే కాలంలో నీరు, పశుగ్రాసం తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ముందస్తుగా తగు జాగ్రత్త చర్యలు చేపట్టకుంటే ప్రజలు తీవ్రస్థాయిలో నష్టపోతారని, ఆహార సంక్షోభం సయితం ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టును సకాలంలో నిర్మించి నీళ్ల ఇవ్వకపోవడం, రైతులకు పండించిన పంటకు గ్యారెంటీ లేకపోవడం జిల్లాలో ఉన్న నీటి వనరులను సకాలంలో సక్రమంగా వినియోగించుకోవడంలో పాలకులు వైఫల్యం చెందినారని అన్నారు. రైతుల రుణాలు రీ షెడ్యూలు చేయాలని కోరారు. ప్రతి ఎకరాను సంబంధిత అధికారులు పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తిరిగి నష్టం పరిహారం రూపంలో రైతులకు నగదు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాబోయే కాలంలో రైతులను, వ్యవసాయ కార్మికులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఎనిమిరెడ్డి నాగిరెడ్డి, సూరెడ్డి రమణారెడ్డి, కత్తి ఏబు, రాములు, వెలుగొండయ్యతో పాటు స్థానిక పంట పొలాల రైతులు పాల్గొన్నారు.

వెంచర్‌కు వెళ్లే రహదారి కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోకుండా వదిలేశారు.

గడపగడపకూలో బాలినేనికీ విన్నపం

గడపగడపకూ కార్యక్రమంలో బాగంగా సుందం ్నగర్‌కు వచ్చిన బాలినేనికి ఇక్కడ ప్లాటు ఉన్న యజమాని బత్తుల వెంకారెడ్డి అర్జీ ఇచ్చారు. వైసిపి నేత యానాదిరావు తమ ప్లాట్లకు అడ్డంగా గోడ కట్టారని విన్నవించారు. ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని చెప్పారు. పక్కనున్న అధికారులకు పరిష్కారం చేయాలని బాలినేని సూచించారు. అయిన్పటికీ వెంచర్‌లో ప్లాట్లను ఇప్పుడు భూవివాదంలోకి నెట్టారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు

రెండేళ్లుగా తమ ప్లాట్లకు వెళ్లే రహదారికి గోడ కట్టి తమను బెదిరిస్తున్నారంటూ.. ఈ వెంచర్‌లో 80 గదుల ప్లాటు ఉన్న యజమాని బత్తుల వెంకారెడ్డితో పాటు కొందరు యజమానులు సోమవారం నాడు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. సుమారు పది నిమిషాల పాటు ఎస్పీ మల్లికాగర్గ్ ఈ ఉదంతాన్ని శ్రద్ధగా విన్నారు. వివరాలన్నీ బాధితులు చెప్పారు. వైసిపి నేత యానాదిరావు తమ ప్లాట్లకు వెళ్లే రహదారిని ఆక్రమించి గోడ కట్టారని స్పష్టంగా వివరించారు. గతంలో డిఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన విషయాన్ని బాధితులు ఎస్పీకి గుర్తుచేశారు. ఎస్పీ మల్లికాగర్గ్ సానుకూలంగా స్పందించారని బాధితులు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

15న చలో విజయవాడ

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొంటారని, ఈ బహిరంగ సభకు ప్రజలు అధికసంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి జి సుధాకర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, గోళ్ళ నాగరాజు, దీపాల సత్యనారాయణ, పప్పుల అహరోను, బసవకోట్లు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పి.మనోజ్ పాల్గొన్నారు.

ఊరించిన మబ్బులు..

ప్రజాశక్తి-ఒంగోలు

ఆకాశమంతా సోమవారం మబ్బులు కమ్మాయి.మబ్బులను చూసి వర్షం పడుతుందని రైతులు ఆశపడ్డారు. చివరకూ వారికి నిరాశే మిగిలింది.చిరుజల్లులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. వర్షం పడితే పంటలు సాగయ్యేవని రైతులు చెప్పారు. జిల్లా కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి.దీంతో పంటలకు కొద్దిమేర ఊరట కలిగింది.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1,67,703

సిఎస్‌పురం : మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయ ఆదాయం 1,67,703 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి తెలిపారు. దర్శన టికెట్ల అమ్మకం ద్వారా రూ.73 వేలు, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.30,640, అన్నదానానికి రూ.18,831, ఆలయ మహాప్రాకార నిర్మాణానికి రూ.30,232, ఇతర విరాళాలు రూ.15,000 వచ్చినట్లు తెలిపారు. ఆలయ మహాప్రాకార నిర్మాణానికి దాతలు మార్కాపురానికి వేముల వేంకటేశ్వర్లు, పుష్పలత రూ.25 వేలు అందజేసినట్లు ఇఒ తెలిపారు.

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

సిఎస్‌పురం : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం వంటసామగ్రి అందజేశారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఇఒలు ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి వంట సామగ్రి, లైబ్రరీ పుస్తకాలు పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి సతీష్, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు

మేత కరువై..పశుపోషణ భారమై..

(మొదటిపేజీ తరువాయి)

అదనపు భారం పడుతోంది. క్రమేపీ వరిగడ్డి ధరతో పాటు ప్రయాణ ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు.

భారంగా పశుపోషణ..

వరిగడ్డి ధరలు విపరీతంగా ఉండటం, పచ్చి గడ్డి దొరకకపోవడంతో రైతులకు పశు పోషణ భారంగా మారింది. ఎక్కువ ధర పెట్టి ఎండుగడ్డి కొనేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కొందరు రైతులు పాడి గేదెలను అమ్ముకుంటుండగా, ఒట్టిపోయిన గేదెలను కబేళాలకు తరలిస్తున్నారు. పశు పోషణపైనే ఆధారపడిన రైతులు ఇతర ప్రాంతాలకు పశువులను తరలించుకుపోతున్నారు. ఓవైపు వ్యవసాయ పంట రుణాలు పూర్తిగా మాఫీ జరుగకపోవడం, కొత్త రుణాలు పుట్టక అందోళనలో ఉన్న రైతులకు, పాడి పరిశ్రమ దెబ్బతినడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు నిరుపయోగంగా మారడం, గేదెలకు పశుగ్రాసం అందకపోవడం వంటి కారణాలతో పాల దిగుబడి క్రమేపీ తగ్గిపోయిందని పశు పోషకులు చెబుతున్నారు. నీటి ఎద్దడి, గ్రాసం కొరత, ఎండుగడ్డికి ధరలు పెరగడంతో ఈ ప్రాంతం నుంచి రైతులు పశువులను సాగర్ పరివాహక ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు. .

భగ్గుమంటున్న వరిగడ్డి ధరలు

మూడావత్ రెడ్డి నాయక్, పశు పోషకుడు, పిల్లికుంట తాండా

వర్షాభావం కారణంగా పచ్చిమేత కరువైంది. దీంతో ఎండుగడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. ట్రాక్టర్ వరిగడ్డి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ధర పలుకుతోంది. లారీ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.36 వేల ధర ఉంది. దీంతో పాటు రవాణా ఛార్జీలు కలుపుకుంటే అదనంగా మరో రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు అవుతోంది.

భారంగా పశు పోషణ

భవనాసి జయమ్మ, పశు పోషకులు, మురారిపల్లి

వర్షాలు లేక పంటలు ఎండి పోతున్నాయి. పచ్చిమేత దొరకడం గగనమైంది. ఎండుగడ్డి ధరలు భగ్గుమంటున్నాయి. రోజుకు 4, 5 లీటర్లు పాలిచ్చే గేదెలు 2, 3 లీటర్లు ఇవ్వలేక పోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పశు పోషణ తలకుమించిన భారంగా మారింది. రెండు గేదెలున్నప్పటికీ పాల దిగుబడి తగ్గిపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది.



నివాళులర్పిస్తున్న మోపిదేవి వెంకటరమణ

సీతారావమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-పర్చూరు

ప్రకాశం జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ రావి రామనాథంబాబు మాతృమూర్తి సీతారావమ్మ దశదిన ఖర్మకు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. రామనాథం బాబుని పరామర్శించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సోమవారం వారి స్వగ్రామమైన అడుసుమల్లిలో జరిగిన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, మాజీమంత్రి వసంత నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర సహకార శాఖ ముఖ్య సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు లింగిశెట్టి రామాంజనేయులు, పలువురు జడ్పిటిసిలు, ఎంపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరయ్యారు.



పంటల పొలాలను పరిశీలిస్తున్న రమణారెడ్డి

పొలాల పరిశీలన

ప్రజాశక్తి-చీరాల

గవినివారిపాలెం పంచాయతీలోని పుల్లాయి పాలెం లింగాపురం గ్రామాల సాగు చేసిన వరి పొలాలను చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి సోమవారం పరిశీలించారు. డఫ్ అండ్ డం స్కూల్ సమీపంలో పేర్లీ డ్రైన్ పై నిర్మించిన ఎత్తిపోతల పంపింగ్ స్కీం కింద సాగు జరుగుతున్న నక్కలవారిపాలెం, దేవినూతల పంచాయతీల్లో పుల్లాయపాలెం, లింగాపురంలో సుమారుగా 800 ఎకరాలుకు వరి సాగు జరిగింది అన్నారు. రైతులు నీరు సక్రమంగా అందుతుందని తెలిపారు.వరి పైర్లు ను ఆశించు దోమ నివారణ, పురుగు నివారణ తెగులు నివారణ ఆర్ బి కె విఎఎలుకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విఎఎ ఆదర్శ మరియు రైతుల పాల్గొన్నారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న బాబూరావు

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చీరాల

పేద విద్యార్థి చదువు అవసరాల నిమిత్తం ప్రేమ హాస్పిటల్ ఎండి, వైసిపి డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఐ బాబురావు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన సోమవారం స్థానిక ప్రేమ హాస్పటల్లో విద్యార్థికి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ కరణం వెంకటేష్‌బాబు జన్మదిన పురస్కరించుకున్న సందర్భంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థికి సేవా కార్యక్రమంలో భాగంగా చేయూతను అందించినట్లు తెలిపారు. విద్యార్థి బాగా చదువుకొని జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు.

ఆర్టీసీ డ్రైవర్ పై దాడికి యత్నం..

ఆటో పక్కకు తీయమన్నందుకు.. వాదనకు దిగిన వైనం

ప్రజాశక్తి -శింగరాయకొండ



బస్సు డ్రైవర్‌తో వాగ్వివాదం చేస్తున్న ఆటో డ్రైవర్లు, నిలిచిన ట్రాఫిక్

రోడ్డు మీద పోలీసులకు ట్రాఫిక్ పెట్టకపోవడంతో కావలిలో జరిగిన సంఘటన మరువక ముందే టంగుటూరులో మరొకటి సోమవారం చోటుచేసుకుంది. తెలంగాణ ఆర్టీసీ డ్రైవర్ మీద ఆటో డ్రైవర్లు తిరగబడ్డారు. ఒంగోలు వైపు నుంచి శింగరాయకొండ వైపు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సు టంగుటూరు బొమ్మలు సెంటర్‌కి రాగానే నాలుగు రోడ్ల జంక్షన్ కావడంతో అన్ని అడ్డంకులు ఉన్నాయి. ఆర్టీసీ డ్రైవర్ హారన్ కొట్టి ఆటోను తొలగమన్నందుకు ఆటో డ్రైవర్లు బస్సుకు ఆటోలను అడ్డంపెట్టి డ్రైవర్‌పై వాదనకు దిగారు. చివరకు బస్సులో ఉన్న డ్రైవర్ సైతం కిందకు దిగివచ్చి వాదన పెట్టుకోవలసిన పరిస్థితి అక్కడ కనిపించింది. ఇద్దరి మధ్య వాగ్వివాదం జరగటంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా ఆగిపోయింది. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉన్న ఆ ప్రాంతంలో ఉదయం సాయంత్రం సమయంలో పోలీసులు పరివేక్షించాల్సింది పోయి వదిలివేయడం ఏంటని స్థానికులు అంటున్నారు. ఏది ఏమైనా గత నాలుగు రోజుల నుంచి నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుమీద అడ్డం తొలకమన్నందుకు దాడి చేసిన ఘటన సంచలనం సష్టించింది. అదే రీతిలో టంగుటూరులో ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుమీద ఆటో తొలగమన్నందుకు అతనిపై వాదనకు దిగి కొట్టుకున్నంత పనైందని అక్కడ ప్రయాణికులు చెబుతున్నారు. పోలీసులు ట్రాఫిక్ వ్యవహారంలో చేతులెత్తేయడం వలనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని జనం చెబుతున్నారు.

మహిళలపై బస్సు కండక్టర్ అసభ్యకర ప్రవర్తన

ప్రశ్నిస్తే బస్సు నుంచి దింపేసిన వైనం

ప్రజాశక్తి-కంభం రూరల్

ఆర్టీసీ బస్సు ఎక్కిన మహిళలపై బస్సు కండక్టర్ అసభ్యకరంగా ప్రవర్తించి ఎదురు తిరుగుతావా అంటూ బస్సు నుంచి దింపేశాడని షేక్ వహీదా అనే మహిళ ప్రజాశక్తి ఎదుట సోమవారం వాపోయింది.. ఈ సంఘటన పొదిలిలోని ఆర్టీసీ బస్ డిపోలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చోటు చేసుకుంది.. కంభంకు చెందిన షేక్ వాహిదా తన కూతురు, ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి ఒంగోలులో ఉంటున్న తన అక్క ఇంటికి ఆదివారం మధ్యాహ్నం బయలుదేరింది. ఆమెకు నేరుగా కంభం వచ్చేందుకు గిద్దలూరు డిపో బస్సులు లేకపోవడంతో పొదిలికి వచ్చి అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు గిద్దలూరు డిపో బస్సు (బస్సు నెంబర్ 3417)ఎక్కింది. అయితే రద్దీగా ఉన్న బస్సులో పిల్లలు సామాన్లతో జనాల మధ్య నుంచి వెళ్లడం కష్టంగా ఉండడంతో ఆర్టీసీ కండక్టర్ ఆమెను భుజంపై చేతితో కొట్టి త్వరగా లోపలికి వెళ్ళమని ఆమె భుజం మీద చేతితో కొట్టాడు. దీంతో ఏంటని ఆమె ప్రశ్నించగా కండక్టర్ ఆమె కూతురిని సైతం అందరి ముందు భుజం మీద చేతితో కొట్టి ఇలా కొట్టడం తప్పా అని హేళన చేశాడాని వాపోయింది. తర్వాత బస్సు ఆపి తమను దిగిపొమ్మని ఆడవాళ్ళను కనికరం కూడా లేకుండా దింపేశాడని వహీదా తెలిపారు. దాంతో ఆమె సుమారు గంటకు పైగా పొదిలి బస్టాండులో వేచి ఉండి మరో బస్సులో కంభం చేరుకున్నట్లు ఆమె, ఆమె కూతురు వాపోయారు. దీనిపై పోలీసు అధికారులకు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

విద్యాభారతి స్మార్ట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చీరాల



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ నిర్వాహకులు

విద్యాభారతి స్మార్ట్ స్కూల్ విద్యార్థులు చదువులోనే కాదు ఆటలలో సైతం సత్తా చాటుతారని విద్యాభారతి స్కూల్ కరస్పాండెంట్ మళ్ళా వాసవి చంద్రిక అన్నారు. అక్టోబరు 29వ తేదీన జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ఆధ్వర్యంలో మంగళగిరిలో నిర్వహించిన 8వ జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటిన శ్రీ విద్యాభారతీ స్మార్ట్ స్కూల్ విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మళ్ళా వాసవి చంద్రిక,విజయకృష్ణ మాట్లాడుతూ ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఆరు వందల మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా ఈపురుపాలెం శ్రీ విద్యా భారతీ స్మార్ట్ స్కూల్‌కు చెందిన జి భవ్యశ్రీ, టి వినమ్రత లక్ష్మి, ఎస్‌కె నాగుల్ జాను అనే ముగ్గురు విద్యార్థులు స్వర్ణ పతకం సాధించారని అన్నారు. అలాగే ఏ వెంకట సాయి, ఝాన్సీ కాంస్య పతకం సాధించారని, ఈ ఘనవిజయానికి కారణమైన విద్యార్థులని కరాటే మాస్టర్ టి మోహన్ కృష్ణని అభినందిస్తున్నామని అన్నారు.

అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఐక్యత విజయపథం యాత్రలో విశ్రాంత కలెక్టర్ విజయకుమార్

ప్రజాశక్తి-బాపట్ల

బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను వెనుకబడిన తరగతుల ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం కల్పించి రాజ్యాధికారం కోసం పాటుపడాలని విశ్రాంత ఐఎఎస్ అధికారి విజయకుమార్ అన్నారు. విజయ్ కుమార్ చేపట్టిన ఐక్యత విజయపథం యాత్ర సోమవారం బాపట్లలో జరిగింది. పట్టణంలో కొత్త బస్టాండ్ వద్ద నుండి బయలుదేరిన ఐక్యత విజయపథం యాత్ర అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాల ప్రజలను చైతన్యం పేదరిక నిర్మూలనకోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయపథం యాత్రలో భాగంగా బాపట్ల విచ్చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, ఎస్సీ నాయకులు ముప్పిరి రాజశేఖర్, విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో అంటరానితనం నిర్మూలన రాష్ట్ర అధ్యక్షులు జి.చార్వాక, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పెద్దపోలయ్య

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-దొనకొండ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగదేవిపల్లి గ్రామం వద్ద సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. మండలంలోని కట్టకిందపల్లి గ్రామానికి చెందిన కాటే పెద్దపోలయ్య తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై దర్శి వెళ్లి తిరిగి దొనకొండ వస్తున్నాడు. గంగదేవిపల్లి గ్రామం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో తలకు బలమైన గాయమై రోడ్డుపై పడిపోయాడు. 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకొని బాధితుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్చగా చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించినట్లు సమాచారం.



మృతి చెందిన వెంకటయ్య

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లలచెరువు



మండలంలోని శతకోడు గ్రామ పొలాల్లో అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చినది. బాధితుల కథనం ప్రకారం మండలంలోని తెల్లగట్ల గ్రామానికి చెందిన మోరబోయినా వెంకటయ్య(65) ప్రతిరోజూ పొలాలకు పశువులను మేపుకునేందుకు వెళ్లాడు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం శతకోడు పొలాలకు వెళ్లిన విగత జీవిగా పడి ఉన్నాడు. సాయంత్రం అటుగా వెళ్లిన వాళ్లు కింద పడిఉన్న వెంకటయ్యను చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే ఆయన చనిపోయి ఉన్నాడు. ఆయనకు భార్యా, పిల్లలు ఉన్నారు. ఎస్ఐ శ్రీహరి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనరేటర్‌లో చీర పడి మహిళ మృతి

ప్రజాశక్తి-వేటపాలెం



చుండూరి పద్మ

గ్రామోత్సవంలో జనరేటర్‌లో మహిళ చీర పడి మృతి చెందిన సంఘటన వేటపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానికంగా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఎప్పటి మాదిరిగానే దసరా నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల అనంతరం నిర్వహించే గ్రామోత్సవంలో దేవుడి బండి ఊరేగింపు వద్దకు చుండూరి పద్మ (55)అనే మహిళ స్వామి దర్శనం చేసుకుని ప్రసాదం తీసుకుందామని బండి వద్దకు వచ్చే క్రమంలో బండి వెనక ఉన్న జనరేటర్‌లో మహిళ చీర చెంగు పడి తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించే క్రమంలో మార్గమధ్యంలో ప్రాణాలు విడిచింది. సమాచారం అందుకున్న వేటపాలెం ఎస్ఐ జి సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మృతురాలి కుమారుడు చేత ఫిర్యాదు తీసుకొని చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



జెసి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సమాజ్‌వాదీ నేతలు

స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్టంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని సమాజ్ వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు స్పందన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అందుకనుగుణంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. హరిజన, గిరిజన, వెనుకబడిన, మైనారిటీ నిరుద్యోగ యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులు, బ్యాంకులు, ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలకు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో ఫీజులు చెల్లించలేక ఎంతోమంది నైపుణ్యం గల అభ్యర్థులు వెళ్లలేక నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బహుజన, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులు బోయిన సూరిబాబు, కోమ్మనబోయిన ఫణింద్ర, గండికోట వెంకటరావు, నాగూర్, పీలా సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రామాంజనేయులు

'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - పంగులూరు

జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన ఈనెల 3న పంగులూరులో జరుగుతుందని ఎంపీడీఓ రామాంజనేయులు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులుతో సోమవారం సమావేశం నిర్వహించారు. జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో జరుగుతుందని అన్నారు. కలెక్టర్ రంజిత్ బాషాతోపాటు ఇతర జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు. ప్రజల సమస్యలు అధికారులకు విన్నవించుకోవాలని కోరారు. వీలైనంతవరకు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం చేస్తారని తెలిపారు. మండల, గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రామ్ కుమార్, పిహెచ్‌సి డాక్టర్ శివ చెన్నయ్య, ఈఓఆర్‌డి రాంబాబు, పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

గ్రామ సభల షెడ్యూల్

ప్రజాశక్తి -యద్దనపూడి

ఎన్ఆర్ఇజిఎస్ 15వ సామాజిక తనిఖీ గ్రామ సభల షెడ్యూల్‌ను ఎంపిడిఒ జి రమేష్ బాబు తెలిపారు. నవంబర్ 2న యనమదల, 3న జాగర్లమూడి, 1న పోలూరు, 4న వింజనంపాడు, 6న శ్యామలవారిపాలెం, 2న గన్నవరం, 6న యద్దనపూడి, 4న పూనూరు, 6న పెద్దివారిపాలెం, 1న సూరవరపుపల్లి, 6న అనంతవరం, 1న తనుబొద్దివారి పాలెం, 4న మున్నంగివారిపాలెం, 7న చిమటావారిపాలెం గ్రామాలలో జరిగే గ్రామ సభలలో లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొనాలని కోరారు. వివిధ గ్రామాల్లో జరిగిన పనులను సమీక్షిస్తారని తెలిపారు. తనిఖీల్లో పూర్తి సమాచారంతో సిబ్బంది హాజరు కావాలని కోరారు. చేసిన పనులు, చెల్లింపుల వివరాలు, పనిదినాల వివరాలు చూపాలని తెలిపారు.

నేడు సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని నేడు ప్రారంభోత్సం చేయనున్నట్లు ఎంపిడిఒ కృష్ణకుమారి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణ మోహన్ హాజరవుతారని తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

ప్రజాశక్తి - భట్టిప్రోలు (చుండూరు)

వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం దుండిపాలెం గ్రామంలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగర్జున సోమవారం నిర్వహించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇప్పటివరకు ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని పత్రికల రూపంలో ముద్రించి అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఇప్పటివరకు లబ్ధి పొందని కుటుంబం ఒక్కటీ ఉండదన్నారు. ప్రతి కుటుంబంలో ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకం అమలు జరిగి ఉంటుందని అన్నారు. ఒక్కో కుటుంబంలో ఇప్పటివరకు రూ.లక్షకుపైగా లబ్ధి చేకూరిన దాఖలాలు ఉన్నాయని అన్నారు. సంక్షేమం వైసీపీ ప్రభుత్వానికి సాధ్యమవుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు.

పంగులూరు : ప్రజా సంక్షేమం ఫలాలు అందించడంలో అలుపెరుగని కృషి చేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని బలపరచాలని వైసీపీ ఇన్చార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య కోరారు. మండలంలోని పంగులూరు - 2 సచివాలయ పరిధిలోని జనకవరం గ్రామంలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి గత నాలుగేళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసీపీనీ గెలిపించాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఏదోక రూపంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఏడాదికి ప్రతి కుటుంబానికి కనీసం రూ.లక్ష వరకు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి వైసీపీ ప్రభుత్వం రావాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు అందరికీ, అవినీతికి తావు లేకుండా పార్టీలు, రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. వృద్ధులకు క్రమం తప్పకుండా ఒకటో తేదీన పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాయని వెంకట సుబ్బారావు, వైసిపి నాయకులు గుర్రం దేవేంద్ర, తలపనేనివేణు బాబు, తలపనేని ఆంజనేయులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున



గడప గడపకు కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

ఖోఖో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

గోవాలో జరుగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ ఖోఖో బాలుర జట్టుకు వైసీపీ ఇంచార్జ్, శాప్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య క్రీడా దుస్తులు అందజేశారు. గత ఐదు నెలలుగా స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకా డమీలో జరుగుతున్న 37వ శిక్షణా శిబిరం సోమవారం అత్యంత ఘనంగా ముగిసింది. శిక్షణ ముగింపు సభలో వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, రామారావు, జడ్పిటిసి రాయిని ప్రమీల వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ నూతలపాటి వీర రాఘవులు, రోటరీ క్లబ్ అధ్యక్షులు కరణం హనుమంతరావు, క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీర రాఘవయ్య మాట్లాడారు. క్రీడాకారులకు కృష్ణ చైతన్య చేతుల మీదుగా శాప్ వారు అందజేసిన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ శిక్షణా శిబిరం పర్యవేక్షకులుగా కోచ్ డి లక్ష్మీ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కోచ్‌గా బ్రహ్మానాయుడు, సహాయకునిగా అంతర్జాతీయ క్రీడాకారుడు కర్రి శ్రీనివాసరావు, మేనేజర్ కె హనుమంతరావు, జాగర్లమూడి సుబ్బారావు వ్యవహరించనున్నారు. ఈ శిక్షణా శిబిరం మే 26న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రివర్యులు ఆర్‌కె రోజా చేతుల మీదుగా అత్యంత ఘనంగా ప్రారంభించారు. శాప్ విసి అండ్ ఎండి హర్షవర్ధన్, కలెక్టర్ రంజిత్ భాష, ఆంధ్ర ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య, చీఫ్ పాట్రన్ ఉగ్ర నరసింహారెడ్డి, సెక్రటరీ ఎం సీతారామిరెడ్డి, ప్రెసిడెంట్ టిఎస్ఆర్‌కె ప్రసాద్, ఎంవిఎస్ ప్రసాద్, ప్రకాశం జిల్లా ఖో ఖో అసోసియేషన్ కార్యదర్శి బి కాశీ విశ్వనాథరెడ్డి, ప్రెసిడెంట్ కె భాస్కరరావు పాల్గొన్నారు. ఈ టీంకు శిక్షకులుగా డి లక్ష్మీనారాయణరెడ్డి, బ్రహ్మానాయుడు, కర్రి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా కోచ్ పాల్ కుమార్, కె హనుమంతరావు పర్యవేక్షిస్తారని సీతారామిరెడ్డి చెప్పారు.



రాష్ట్ర ఖోఖో జట్టుతో వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య



ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దారు మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని పెనుమూడి గ్రామంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కృష్ణ నది పరివాహక, సముద్ర తీర ప్రాంతాలలో సంభవించే వరదలు, తుఫానులు, సునామీల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వరదలు, తుఫానులు సంభవించి నప్పుడు ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం కూడా పెద్దఎత్తున జరుగుతుందని వివరించారు. అలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు ప్రాణనష్టం జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అనుసరించాల్సిన విధానాలను చర్చించారు. ప్రజలకు, తమ ప్రాణాలు కాపాడుకోవడం తోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది నిర్వహించే అవగాహనలో పాల్గొనాలని కోరారు.

కరాటేలో పతకాల పంట

ప్రజాశక్తి - బాపట్ల

గుంటూరు జిల్లా మంగళగిరి ఈద్గా మసీద్ ఫంక్షన్ హాల్లో ఈనెల 29న జరిగిన జాతీయ స్థాయి 8వ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్2023 పోటీల్లో స్థానిక వైఎన్ఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీలో శిక్షణ పొందిన బాపట్లకు చెందిన విద్యార్థులు పతకాల పంట పండించారని అకాడమీ వ్యవస్థాపకుడు యర్రా నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. 8ఏళ్ళలోపు బాలుర విభాగంలో అకాడమీ విద్యార్థి ఈశ్వర్ ఆరంజ్ బెల్ట్, కటా, కుమితెలో బంగారు పతకం సాధించాడు. 9ఏళ్ళలోపు బాలికల విభాగంలో అనికా బ్లాక్ బెల్ట్, కటాలో వెండి, కుమితెలో బంగారు పతకం, 9ఏళ్ళలోపు బాలుర విభాగంలో లాస్మిత్ దేవ్ ఎల్లో బెల్ట్, కటాలో రజిత, కుమితేలో వెండి పతకం, 10ఏళ్ళలోపు బాలికల విభాగంలో పావన్య ఆరంజ్ బెల్ట్, కటాలో బంగారు, కుమితెలో రజితం, 11ఏళ్ళలోపు బాలుర విభాగంలో మాధవ్ బ్లాక్ బెల్ట్, కటాలో వెండి, కుమితెలో రజితం, 12ఏళ్ళలోపు బాలుర విభాగంలో పార్థు బ్లూ బెల్ట్, కటాలో బంగారు, కుమితెలో బంగారు పతకం. 13ఏళ్ళలోపు బాలికల విభాగంలో జాగృతి వెంకట సాయి గ్రీన్ బెల్ట్, కటాలో బంగారు, కుమితెలో రజిత పతకం, 13ఏళ్ళ లోపు బాలుర విభాగంలో మోహిత్ ఎల్లో బెల్ట్, కటా బంగారు, కుమితెలో వెండి పతకం, 13ఏళ్ళలోపు బాలుర విభాగంలో అల్తాఫ్ గ్రీన్ బెల్ట్, కుమితెలో వెండి పతకం, 14ఏళ్ళ లోపు బాలికల విభాగంలో సుహానా తబ్సుమ్ బ్లూ బెల్ట్, కటాలో బంగారు, కుమితెలో బంగారు పతకం, 14ఏళ్ళలోపు బాలుర విభాగంలో పవన్ గ్రీన్ బెల్ట్, కటాలో బంగారు, కుమితెలో బంగారు పతకం, 15ఏళ్ళలోపు బాలుర విభాగంలో రవి బ్లాక్ బెల్ట్, కటాలో రజిత, కుమితెలో వెండి పతకం, పురుషులు విభాగంలో గోపి బ్లాక్ బెల్ట్, కుమితెలో బంగారు పతకం, రాఘవేంద్ర,గ్రాండ్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ కైవసం చేసుకున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీ బాపట్ల టీం కైవసం చేసుకుందని తెలిపారు. పథకాలను కైవసం చేసుకున్న కరాటే విద్యార్థులను, కరాటేలో అత్యంత మెళకువలు నేర్పిన యర్రా నాగేశ్వరరావును అభినందించారు.



కరాటేలో పథకాలు సాధించిన విద్యార్ధులతో యర్రా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

ప్రజాశక్తి - బాపట్ల

రాజ్యాంగ లక్షణమైన ప్రజాస్వామ్యం నానాటికి బలహీన పడుతోందని జెవివి రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో హెూంలో జెవివి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం - ఎన్నికలు, ఓటరు చైతన్యం అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఎన్నికల్లో ధనం, కులం, మతం, మద్యం, నేరస్థ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని అన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ కె విజయ్ కుమార్, విశ్రాంత అధ్యాపకులు గోరంట్ల శాంతరావు, ఆట్ల బాలాజీరెడ్డి, కోలా శరత్, కరణం, పిసి సాయిబాబు, వై భాస్కరరావు, జివి బ్రహ్మం, గుదే రాజారావు, బక్క జయరామిరెడ్డి, నూర్ భాషా ఖాసిం, కె కోటేశ్వరరావు, దాసరి లక్ష్మి, పి ప్రసాద్, పి కోటయ్య, ఎస్‌కె సుభాని, జి పూర్ణచంద్రరావు, గుంటూరు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

కడలూరు బోట్ల హల్‌చల్

- వేట సాగక స్థానికుల అవస్థలు
- సోనా బోట్లపై యుద్ధానికి సిద్ధమంటున్న మత్స్యకారులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - శింగరాయకొండ

సముద్రంలో వేట సాగక.. పూట గడవకు మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేపలు పడక జీవనంగా కష్టతరంగా ఉంది. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రం కడలూరు బోట్లు ఇక్కడ వచ్చి మత్స్య సంపదను దోచుకెళు_న్నారు. కడలూరు బోట్లను అడ్డుకోవాల్సిన మత్స్యశాఖ అధికారులు చేతులెత్తేశారు. మెరైన్ పోలీసులు తమవల్ల కాదంటున్నారు. దీంతో మత్స్యకారులే కడలూరు బోట్లు అడ్డుకునేందుకు సిద్ధమవుతున్నారు. మత్స్యకారులు తీరంలో సమీపంలో వేట చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కడలూరు సోనా బోట్లు సముద్రం ఒడ్డుకు 12 కిలోమీటర్లు దూరంలో వేట సాగించాల్సి ఉంది. అయితే ఆ బోట్లు సముద్రం ఒడ్డు వరకూ వచ్చి వేట సాగిస్తున్నాయి. దీంతో స్థానిక మత్స్యకారులకు వేట సాగక..పూట గడవక తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో మత్స్య కారులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకొని కడలూరు బోట్లను అడ్డుకోవాలని తీర్మానించారు. గత రెండు నెలల క్రితం నెల్లూరు, ప్రకాశం జిల్లాలోని మత్స్యకారులు నెల్లూరులో సమావేశమై కడలూరు బోట్లను అధికారులు అడ్డుకోలేకపోతున్నారని, మనమే యుద్ధానికి సిద్ధం కావాలని తీర్మానించారు. అనంతరం ఒడ్డు నుండి నల్లమందు, తారజువ్వలతో యుద్ధం మొదలుపెట్టారు. ఆ సమయంలో వారం రోజులు పాటు సోనా బోట్లు కనుమరుగయ్యాయి. అనంతరం మళ్లీ ఒడ్డుకు వచ్చి వేట సాగిస్తున్నాయి. దీంతో మత్స్యశాఖ అధికారులకు తీరప్రాంతంలోని మత్స్య కారులందరూ ఫిర్యాదు చేశారు. దీంతో మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి రంగంలోకి మెరైన్ పోలీసుల సహకారంతో కడలూరు బోట్లను అడ్డుకున్నారు. వాస్తవంగా 8 నాటికలు మైళ్ళ దూరంలో సోనా బోట్లు వేట సాగించాలి. అంటే సుమారు 13 కిలోమీటర్ల అవతల వైపున ఉండాల్సిన సోనా బోట్లు ఒడ్డుకు వచ్చి వేట సాగిస్తున్నాయి. సోనా బోట్లకు అడ్డుకట్ట వేయాలంటే మెరైన్ మత్స్యశాఖ అధికారులు స్పీడ్ బోటు అవసరమని నిర్ణయించారు. స్పీడ్ బోట్ల కొనుగోలుకు భారీగా ఖర్చు అవుతుందని తెలియడంతో రెండు శాఖల అధికారులు వెనకడుగు వేసి చేతులు ఎత్తేశారు. ఈ క్రమంలో వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు పాకల మత్స్యకార గ్రామాల్లో సమావేశమై సోనా బోట్లు అడ్డుకునేందుకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్పీడ్ బోట్ల కొనుగోలుకు కోటి రూపాయల ఖర్చు అవుతుందని, చందాలు వేసుకుని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అనంతరం వైసిపి నాయకులు కూడా చూద్దాం చేద్దాం అంటూ కాలం గడిపేస్తున్నారని మత్స్యకారులు చెబుతున్నారు. అందరూ చేతులెత్తేయటంతో గత్యంతరం లేక మత్స్యకారులందరూ సమావేశమై కడలూరు సోనా బోట్లు అడ్డుకునేందుకు భారీ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. సోనా బోట్లు వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించాలని మత్స్యకార నాయకులు గొల్ల పోతు గోవర్ధన్, వాయిల తాతయ్య పదేపదే అధికారుల దష్టికి తీసుకుపోయారు. అయినప్పటికీ ఎవరూ స్పందించలేదు. సోనా బోట్ల సమస్యను ముఖ్యమంత్రి కార్యాలయం దష్టికి తీసుకుపోయామని అక్కడైనా పరిష్కారం దొరుతుందని ఎదురుచూస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు.



పాకల వద్ద ఒడ్డుకొచ్చి వేటసాగిస్తున్న కడలూరు బోట్లు



వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు

రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

మల్లెల సామ్యేలు అనే వ్యక్తి గుండె ఆపరేషన్ నిమిత్తం ఒంగోలు కిమ్స్ ఆసుపత్రిలో చేరాడు. ఆయనకు బి నెగిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో సామ్యేలు బంధువులు చీమకుర్తిలోని భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ నిర్వహకులను సంప్రదించారు. దీంతో స్పందించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేవరాజ్ చీమకుర్తికి చెందిన రామ్‌కుమార్, ఒంగోలుకు చెందిన నవీన్‌తో రక్తదానం చేయించారు. అత్యవసర సమయంలో రక్తదానం చేసిన క్లబ్ సభ్యులను,ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజ్‌ను సామ్యేలు కుటుంబసభ్యులు అభినందించారు.

బిఎల్‌ఒలు అప్రమత్తంగా ఉండాలి : తహాశీల్దారు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బిఎల్‌ఒలు ఓటు నమోదు విషయంలో అప్రమత్తంగా ఉండాలని తహాశీల్దారు సిహెచ్.ఉష తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ ప్రతి ఓటు విషయంలో బిఎల్‌ఒలు పూర్తిస్థాయిలో పరిశీలించి సమాచారం తమ వద్ద ఉంచుకోవాలన్నారు. నవంబర్ 4, 5 తేదీల్లో బిఎల్‌ఒలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులోఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బిల్ఎల్ఒ అప్రమత్తంగా ఉండాలన్నారు.. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దారు తన్నీరు వెంకటేశ్వర్లు, బిఎల్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహాశీల్దారు

పాలస్తీనాపై యుద్ధం అమానుషం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-టంగుటూరు

అమెరికా అండదండలతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం అమానుషమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఇజ్రాయిల్ తీరును వ్యతిరేకిస్తూ స్థానిక బొమ్మల సెంటర్‌లో సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల మాట్లాడుతూ అమెరికా అండతో సాగిస్తున్న ఈ యుద్ధంలో ఇప్పటికే 8000 మందికి పైగా మరణించినట్లు తెలిపారు. అందులో 3500 మంది చిన్నారులు ఉన్నారన్నారు. 4 రోజుల క్రితం ఆసుపత్రిపై ఇజ్రాయిల్ బాంబు దాడి చేయగా 116 మంది వైద్యులు, 200 మంది వైద్య సిబ్బంది మతి మృతిచెందినట్లు తెలిపారు. 500 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. హమాస్ ంతమొందించడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంతో పాలస్తీనాను తునాతునకలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిత్యం మారణకాండ సష్టిస్తుందని ఆయన ఆరోపించారు. యుద్ధ సామగ్రి, ఆయుధాల అమ్మకాల కోసం అమెరికా ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెడుతూ రాక్షసానందం పొందుతుందని విమర్శించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెజి. మస్తాన్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని సాకుగా చూపి మోడీ ప్రభుత్వం మనదేశంలో కూడా మతోన్మాద చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. మతోన్మాద చర్యలతో బిజెపి ఎప్పటికీ రాజ్యాధికారం సాధించలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వేశపోగు మోజెస్, నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, వేజెండ్ల సింగయ్య, గడ్డం వందనం, మల్లెల కొండయ్య, తన్నీరు సుబ్బారావు, బెజవాడ శివయ్య, ఎం.పెద్ద పేతురు, ముప్పరాజు బ్రహ్మయ్య, ఎస్‌కె.మీరాస్, ఎ.సూరిబాబు, కొల్లాబత్తిన శ్రీను, టి.పాపారావు, షేక్ శ్రీను, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు



పొగ మొక్కలు నాటుతున్న కూలీలు

ఊరించిన వర్షం..

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

వర్షం రైతులను ఊరిసింది. సోమవారం ఉదయం నుంచే ఆకాశంలో నల్లమబ్బులు కమ్మాయి. దీంతో బారీ వర్షం పడుతుందని రైతులు ఆశపడ్డారు. చివరకూ చిరుజల్లులు పడ్డాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పూర్తి స్థాయిలో పంటలు సాగు చేయలేదు. జూన్, జులైలో పడిన కొద్దిపాటి వర్షాలకు 1,200ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆ పంటలు కూడా ఎండుమొఖం పట్టాయి. దీంతో రైతాంగం ఆందోళన చెందారు. రబీ సీజన్ ప్రారంభమై నెలరోజులు దాటినా సరైన వర్షాలు లేక పోవడంతో పంటల సాగు ప్రశ్నార్ధకంగా మారింది. రైతులు దుక్కులు దున్ని బలం మందులు చల్లారు. వర్షం కోసం ఎదురు చూస్తున్న సమయంలో తేలికపాటి వర్షం పడి రైతులను ఊరించిందింది. ఈ పాటికే సాగు చేసిన పంటలకు కొద్దిమేర ఊరట నిచ్చింది. ఈ వర్షం పంటల సాగుకు సరిపోదని రైతులు చెబుతున్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని కట్టావారిపాలెంలో మన ఊరి వికాసం ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు అంతర్జాతీయ తైక్వాండో మాస్టారు మారుతీ ప్రసాదు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించిన తైక్వాండో రాష్ట్ర స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలో బంగారు, వెండి, కాంస్య పతాకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల మానసిక వికాసం, ఆత్మవికాసం పెంపుదలకు కృషి చేయుచున్న మన ఊరి వికాసం సంస్థ నిర్వాహకులు ధర్మవరపు ప్రసాదుకు ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతులు తెలిపారు. అదేవిధంగా విద్యార్థులకు అండగా నిలుస్తున్న అద్దేపల్లి సత్యనారాయణ, మెడికల్ షాపు రవికుమార్‌కు విద్యార్థుల తల్లిదండ్రలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి-పొదిలి

మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా స్థానిక భవిత పాఠశాలలోని విద్యార్థులకు వికలాంగుల సంఘంఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. పొదిలి నగర పంచాయతీ వైసిపి అధ్యక్షురాలు షేక్ నూర్జహాన్ బేగం, వైసిపి మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి అన్నదానాన్ని పారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధాకర్‌రెడ్డి. బీసీ సెల్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచి పులగొర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. అదేవిధంగా చీమకుర్తిలోని ఎస్‌కెఆర్ మానసిక బధిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వైసిపి సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి ఆధ్యర్యంలో అన్నదానం నిర్వహించారు. పొదిలి పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద భారీ కేక్ కట్‌చేసి పారిశుధ్య కార్మికులు, పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ : జేసీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గ్రామదర్శిని కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని జిల్లా సంయుక్త కలెక్టరు సిహెచ్. శ్రీధర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 135 మంది అర్జీలు అందజేశారు. అనంతరం వీక్షణ సమావేశం ద్వారా తహాశీల్దార్లు, ఎంపిడిఒలతో జేసీ నేరుగా మాట్లాడారు. తనపరిధిలోని అర్జీలను తక్షణమే పరిష్కరించారు. మిగిలిన వాటిని పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు పంపారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి జిల్లా అధికారులు, ఎంపిడిఒలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం పోర్టల్లో నమోదైన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. అర్జీలు పునరావతం కాకుండా అధికారులు సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. ఒకటో తేదీన సామాజిక భద్రత పింఛను పంపిణీ కోసం బ్యాంకుల నుంచి నగదు డ్రాచేసి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో పెండింగ్‌లో ఉన్న 723 ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రపరచాలన్నారు. ఆయా ప్రాంతాల ఎఎన్‌ఎంలు ధవీకరించేలా చూడాలన్నారు. వేమూరు నియోజకవర్గం లోని జగనన్న కాలనీలలో అంతర్గత రహదారులు, మరో 86 పనులు మంజూరైనట్లు తెలిపారు. వాటిని తక్షణమే ప్రారంభించాలన్నారు. ఈ క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీలు పూర్తి అయ్యిందన్నారు. తహాశీల్దార్లు పరిశీలించి ధ్రువీకరించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబరు ఒకటో తేదీన ఘనంగా నిర్వహించాలన్నారు. అధికారులందరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమాల నిర్వహణపై అధికారులు ప్రణాళికలు రూపొందించు కోవాలన్నారు. ఈకార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ జి.రవీంద్రబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శ్రీధర్

పొగాకు రైతులు నిబంధనలు పాటించాలి

ఎఎస్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-టంగుటూరు

సొంత బ్యారన్ కలిగిన రైతులు పొగాకు సాగు చేయడం ఎంతో శ్రేయస్కరమని పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో పొగాకు పంట నియంత్రణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023-24 పంట కాలానికి సంబంధించిన నిబంధనలను రైతులకు వివరించారు. పంట నియంత్రణ ఆవశ్యకతను పాటించాలన్నారు. నల్ల రేగడి నేలలు కలిగిన రైతులు శనగ, మినుము, కంది, మొక్కజొన్న, మిరప, ధనియాలు, పెసర వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం మంచిదన్నారు. పచ్చిరొట్ట ఎరువులను పంటలకు వినియోగించాలన్నారు. పొగాకు పంట చుట్టూ ఎర పంటలైన ఆముదం, బంతి అవరోధ పంటలైన జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ద్వారా చీడపీడల ఉధృతని కొంతమేర నివారించవచ్చని తెలిపారు. పొగాకు రైతుల బ్యారన్ల రిజిస్ట్రేషన్ గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు. సాధారణ రుసుంతో నవంబర్ 9 వరకూ బ్యారన్ల రిజిస్ట్రేషన్‌కు సమయం ఉందన్నారు. నవంబర్ 10 నుంచి 23 వరకూ రూ. 100 రుసుం, నవంబర్ 24 ఉనుంచి డిసెంబర్ 4 వరకూ రూ.400 అపరాధ రుసుంతో రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన మొక్కలను బోర్డు అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు ఎస్‌జిఒ జి.సిద్ధరాజు, పిఎస్‌ఎస్, ఐటిసి, జిపిఐ, ఎస్‌ఎఫ్‌ఎకంపెనీల ప్రతినిధులు రామాంజనేయులు, వెంకట్రావు, శ్రీనివాసులు, ప్రసాద్, తూర్పు నాయుడుపాలెం, మల్లవరప్పాడు, శివపురం గ్రామాల రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న బోర్డు అధికారులు



జాబితాను పరిశీలిస్తున్న అధికారులు ,రైతులు

ఈ క్రాప్ నమోదు జాబితాపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల పరిధిలోని మైనంపాడు రైతు భరోసా కేంద్రం వద్ద ఈ క్రాప్ నమోదు జాబితాపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ పి.పావని మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి సరిచేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. వర్షం పడిన తర్వాత 40 శాతం రాయితీపై రైతులకు శనగ విత్తనాలు అందజేయనున్నట్లు తెలిపారు. పిఎం కిసాన్ నగదు రాని రైతులు తమ బ్యాంకు ఖాతాకు ఎన్‌పిసిఐ లింక్ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులోఉన్నట్లు తెలిపారు. అనంతరం ఎఒ పావని రుద్రవరం, గురవారెడ్డి పాలెం రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైనంపాడు గ్రామీణ అభివద్ధి కమిటీ ఛైర్మన్ గొడుగు మస్తాన్, వైస్ సర్పంచి గుండవరపు సుబ్బారావు, వ్యవసాయ విస్తరణ అధికారి కెవి. సుబ్బారెడ్డి, మైనంపాడు గ్రామ వ్యవసాయ సహాయకుడు తన్నీరు చిరంజీవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిటిఎ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొత్తపట్నం

బిటిఎ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకటరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయక పోగా జిపిఎస్ విధానం బలవంతంగా రుద్దటం సమంజసం కాదన్నారు.ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్రబాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి ఉపాధ్యాయులకు పిఎఫ్ లోన్లు, ఎపిజిఎల్‌ఐ లోన్లు మంజూరు చేయడం లేదన్నారు. అనంతరం ఈతముక్కల, కొత్తపట్నం, గమల్లపాలెం ఉన్నత పాఠశాలలు, రాజుపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాల, పలు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ ఆకార్యక్రమంలో బిటిఎ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారా బత్తిన జాల రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి పల్లె కష్ణమూర్తి, మండల నాయకులు చెక్కా కోటేశ్వరరావు, విజయ్ కుమార్,అల్లరి విజయ్ కుమార్, కర్ర దేవా సహాయం పాల్గొన్నారు.



వెంకటరెడ్డిని సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

వెంకటరెడ్డికి సన్మానం

దర్శి : యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డిని పోతవరం సచివాలయ ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ శ్రీనివాసరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుబ్బారావు, డిజిటల్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, ఎఎన్‌ఎం సుప్రజ, వ్యవసాయ సహాయకుడు నరేంద్ర, ఉపాధ్యాయులు బాసంతి, కల్పన పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి మహేష్

స్పందన అర్జీలను పరిష్కరించాలి

అడిషనల్ ఎస్‌పి మహేష్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిశీలించి లబ్ధిదారులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని అడిషనల్ ఎస్‌పి పి. మహేష్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్‌పి మహేష్ స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 62 మంది మంది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబందిత పోలీస్ అధికారులతో మాట్లాడి స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ జరిపి, నిర్దిష్ట గడువులోపు పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య,ఇతర అధికారులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన, మైనార్టీలకు

వైసిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు : స్వామి

ప్రజాశక్తి-కొండపి

వైసిపి ప్రభుత్వం బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చేసింది ఏమి లేదని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి తెలిపారు. స్థానిక ఎస్‌సి కాలనీ, టంగుటూరు రోడ్డులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గార్యెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ నాలుగున్నరేళ్లలో బడుగు బలహీన, మైనార్టీ వర్గాలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు వారి సంక్షేమం కోసం వినియోగించాల్సి ఉందన్నారు. ఆ నిధులను ఇతర రంగాలకు మళ్లించారని దయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, రాష్ట్ర నాయకుడు వసంతరావు, కొండపి పట్టణ నాయకులు ఎన్.సుబ్బరామయ్య, బి. సోమయ్య, అద్దేపల్లి శ్రీను, పెద్దోడు, వై.వెంకటేశ్వర్లు, కాలేషా, మహిళా నాయకులు బి.ప్రసన్న లక్ష్మి, బి.అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే స్వామి

బాధితుడికి ఎమ్మెల్యే స్వామి పరామర్శ

మర్రిపూడి : మండల పరిధిలోని చిలంకూరి గ్రామానికి చెందిన వీరల చెన్నయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం గురించి కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెన్నయ్యను సోమవారం పరామర్శించారు. అనంతరం చిలంకూరు, గుండ్లసముద్రం గ్రామాల్లో టిడిపి నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ గురించి ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నరసారెడ్డి, మాజీ జడ్‌పిటిసి తుళ్లూరి నరసింహారావు, మాజీ ఎంపిటిసి, తెలుగు రైతు నాయకుడు వీరనారాయణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా... నిరుపయోగం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడికక్కడ అద్వానంగా రోడ్లు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధులు కేటాయించినప్పటికీ పనిచేసేవాళ్లు లేరు. రహదారిని వేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తాతావారిపాలెం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని సురేపల్లి పంచాయతీలోని తాతావారిపాలెం వరకు ఉన్న రహదారికి గత టిడిపి పాలనలో రూ.98.5లక్షల నిధులు మంజూరై బ్యాంకులో ఉన్నాయి. ఈ నిధులతో ఆనాడు సిసి రహదారి నిర్మించేందుకు కీ వాల్ కూడా ఏర్పాటు చేశారు. పనులు పూర్తికాకముందే ఎన్నికల సమీపించడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ఈ రహదారి పూర్తిగా అద్వాన స్థితికి చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. సురేపల్లి, తాతావారిపాలెం గ్రామాల మధ్య ఉన్న రహదారి ప్రస్తుతం కంకర రాళ్లుపైకి లేచి వాహనాలు తిరగడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. రహదారి నిర్మించే గుత్తేదారు మాత్రం గత నాలుగేళ్లుగా ప్రతి ఏటా మధ్యలో అవసరమైన కల్వర్టులను ఏడాదికి ఒకటి చొప్పున మాత్రమే నిర్మించి రోడ్డు పనులు మాత్రం వదిలేశారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సర్పంచి మోర్ల సత్యనారాయణ చొరవ చూపి కొందరి దాతల సహకారాన్ని కలుపుకొని రెండు గ్రామాల మధ్య గుంటలు పడిన ప్రాంతంలో డస్టును నింపి రహదారిని శుభ్రపరుస్తామని ప్రయత్నింగా అధికారులు నిరాకరించారు. దీంతో అది కూడా నిలిచిపోయిందని వాపోయారు. ప్రభుత్వ నిధులతోనే రహదారిని పూర్తి చేస్తామని, దాతల సహకారం అవసరం లేదని చెబుతున్న అధికారులు పనులు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


కంకర రాళ్లు లేచి అద్వాన్నంగా ఉన్న తాతావారిపాలెం రోడ్డు

నిధులకు ముగియనున్న గడువు

సూరేపల్లి, తాతావారిపాలెం గ్రామాల మధ్య రహదారి అభివృద్ధికి మంజూరైన నిధులకు నెలాఖరుతో గడువు ముగుస్తుంది. ఆ నిధులను నెలాఖరులోపు ఖర్చు చేయకుంటే వెనక్కు వెళతాయని చెబుతున్నారు. గత టిడిపి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఇప్పుడెందుకు పనులు చేయాలని వైసిపి నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వైసిపి పాలనలో చేసిన పనులకే బిల్లులు రాక పనులు చేసినవాళ్లు ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు ఉన్న నిదులు వెనక్కి వెళితే తమ గ్రామాల మధ్య రోడ్డు ఏమేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా పరిషత్తు స్పెషల్ డిఈ సాయి కిషోర్ మాట్లాడుతూ ఈ రహదారికి మంజూరైన నిధుల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తున్న మాట వాస్తవమేనని తెలిపారు. దీనిని ఏప్రిల్ ఆఖరి వరకు పొడిగించేందుకు ప్రభుత్వానికి, బ్యాంకుకు సిఫారసు చేసినట్లు తెలిపారు.


స్వామి అర్చనానందను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

వ్యక్తిత్వ వికాసంపై సెమినార్

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీ, రామకృష్ణ సేవా సమితి సంయుక్తంగా బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సోమవారం సెమినార్ నిర్వహించినట్లు కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వి రమణమూర్తి తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి చదువుతోపాటు వ్యక్తిత్వ విలువలు, సేవాతత్వం అవర్చుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణు గోపాల రావు తెలిపారు. ఈ సదస్సులో విజయగనరంకు చెందిన స్వామి అర్చనానంద మాట్లాడుతూ విద్యార్థులు చదువుతున్న సమయంలోనే వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని అన్నారు. అలాంటి విద్యార్థులు సమాజంలో ఎటువంటి కష్టాన్నైనా సమర్ధవంతంగా ఎదుర్కోగలరని వివరించారు. మనస్సును ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలిసిన వ్యక్తి సమాజంలో ఉన్నత స్థాయిలో ఉంటాడని తెలిపారు. ప్రతివ్యక్తిలో అనంతమైన శక్తి, ప్రతిభ, సామర్థ్యం దాగి ఉన్నాయిని, వాటిని ధృడ సంకల్పంతో వెలికి తీసినట్లైతే అనుకున్నది సాధించగలరని తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చెప్పిన సూక్తులు విద్యార్థులకు అర్ధమయ్యే రీతిలో బోధించారు. ఈ సదస్సులో ఇసిఇ విభాగాధిపతి కె జగదీష్ బాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిఎం జి శ్రీమన్నారాయణ

రైతు ఉత్పత్తి సంఘాలకు శిక్షణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మండల సమైక్య కేంద్రంలో 38రైతు ఉత్పత్తి సంఘాల లీడర్లకు శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఏపిఎం జి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ఉత్పత్తులను గుర్తించి వాటిని తయారుచేయడం, వ్యవసాయ రైతు సంఘాలకు తోడ్పాపాటు అందించటం, మెరుగైన ఉత్పత్తులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎరువులు, పురుగుమందుల సామూహిక కొనుగోలు, రుణ సదుపాయం, పుస్తక నిర్వహణ, సమావేశాలు నిర్వహించుకునే విధానం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిసిలు రజిని, హనూక్, సాంబయ్య, అకౌంటెంట్ శిరీష పాల్గొన్నారు.

శ్రీ పురంధరదాసులుకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

ప్రముఖ వాగ్గేయకారులు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు కన్నడ సంగీత పితామహులు శ్రీ పురంధర దాసుల వారి విగ్రహ వార్షికోత్సవం పట్టణంలో సోమవారం నిర్వహించారు. టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్, శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆద్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులోని విగ్రహాలవద్ద పూజలు జరిపారు. అనంతరం మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి కోటేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల అద్దంకిలో స్థాపించడం చాలా గొప్ప విషయం అన్నారు. ఉబ్బ దేవపాలన మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి వారిని భక్తులకు తమ కీర్తనలతో తెలిపిన వాగ్గేయకారులని అన్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి రామాంజనేయులు, మాదాల దానయ్య, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి, రామిసెట్టి రవి, పసుమర్తి కొటయ్య, శేషగిరి, శింగరకొండ రోటరీ క్లబ్ అధ్యక్షులు చిన్ని మురళి, మురగొండి విజయలక్ష్మి, శ్రీ దాస భారతీయ జానపద కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.


శ్రీపురంధర దాసులకు నివాళి అర్పిస్తున్న నేతలు


సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కనపర్తి రవికిరణ్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని పేటేరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వైసిపి ఇంచార్జీ కనపర్తి రవికిరణ్ అన్నారు. మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు చొరవతో గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోందని అన్నారు. ఇప్పటికే గ్రామంలో పలు సీసీ రోడ్డులను వేసినట్లు తెలిపారు. గ్రామా అభివృద్ధికి వివిధ రకాల ప్రత్యేక నిధులు మంజూరు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మేడికొండ సుధాకర చంద్రహాసరావు, పంచాయితీ కార్యదర్శి పుష్ప కుమారి, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు పాల్గొన్నారు.


కార్డన్ సెర్చ్‌కి సిద్ధమైన పోలీసు యంత్రాంగం

నాటు సారా నిర్మూలించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రేపల్లె డీఎస్పీ టి మురళి కృష్ణ సూచనలతో రేపల్లె టౌన్, రూరల్ సీఐలు ఎం నజీర్ బేగ్, ఏ శివశంకర్ ఆధ్వర్యంలో అడవులదీవి పోలీస్ స్టేషన్ పరిధిలోని దిండి పంచాయతీ అదవల గ్రామంలో సోమవారం కార్డాన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గతంలో నాటు సారా తయారు చేసిన ప్రదేశాలతో పాటుగా అనుమానితుల గృహాలను, ప్రాంతాలలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అదవల గ్రామం వెలుపల అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్న బట్టీలను ధ్వంసం చేశారు. నాటు సారా తయారు చేసిన, అక్రమ రవాణా చేసిన, నిల్వవుంచిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై పీడీ చట్టం ప్రయోగించడానికి వెనుకాడబోమని చెప్పారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు గమనిస్తే డయల్ 100, 112లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచార అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాని ఎస్పీ తెలిపారు. ఈ దాడిలో నగరం సెబ్ సీఐ డి.శ్రీనివాసరావు, ఎస్ఐలు ఎస్ వెంకటరవి, వై సురేష్, డి రామకృష్ణ, కె శివప్రసాదరావు, జె నాగరాజు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి - పంగులూరు

గుంటూరులో రోడ్డు ప్రమాదంలో మరణించిన హెడ్ కానిస్టేబుల్ పూర్ణ మహేశ్వరరావు (45) అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన మండలంలోని చిన్నమల్లవరం గ్రామంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. పూర్ణ మహేశ్వరరావు దొనకొండ రైల్వే స్టేషన్‌లోని సీఆర్పీ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన చిన్నమల్లవరం సోమవారం తీసుకొచ్చారు. ఆయన మృతదేహం తీసుకొచ్చేసరికి ఆయన బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆయనతో దోమకొండ రైల్వే స్టేషన్‌లోని జిఆర్‌పి స్టేషన్లో పని చేసే సహచర ఉద్యోగులు, రేణంగివరం ఎస్ఐ తిరుపతిరావు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పోలీసులు తుపాకులతో నాలుగు రౌండ్లు గాలిలో పేల్చి నివాళి అర్పించారు. పూర్ణమహేశ్వరరావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు.


మహేశ్వరరావుకు పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రత్యేక అధికారిగా కృష్ణ కిషోర్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలో 11సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.60లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు మండల ప్రత్యేక అధికారి కృష్ణ కిషోర్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఈనెల 27న మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. రూ.60లక్షలతో సచివాలయాల పరిధిలో సిసి రోడ్ల నిర్మాణానికి, 11వర్కులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. మరో రూ.47 లక్షలతో ఎంజిఎన్ఆర్జిఎస్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు తీసుకుంటామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఒ చింతల రూతమ్మ, సూపర్డెంట్ ఎంవిఎస్ శర్మ, యుడిసి జయరాజ్, జూనియర్ అసిస్టెంట్ నాన్సీ సౌజన్య ఉన్నారు.


స్పెషల్ ఆఫీసర్ కృష్ణకిషోర్



అల్పాహారం వడ్డిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అల్పాహారం

ప్రజాశక్తి బాపట్ల

కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అనేక సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి బిఎస్ నారాయణభట్టు తెలిపారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎ పరిశుద్ధరావు సహకారంతో 250మందికి అందజేకసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూర్లె రామ సుబ్బారావు, శ్రీ రామచంద్ర మూర్తి, దేశరాజు వెంకట రమణ బాబు, గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పూర్తి: కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగే ఎన్నికలలో వినియోగించే వివిప్యాట్లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లకు సంబంధించిన ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సి) పూర్తి అయినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవిఎం గోదామును ఆయన సందర్శించి ఎఫ్ఎల్‌సి కొనసాగుతున్న తీరును పరిశీలించారు. ఈసందర్భ:గా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా ఎఫ్ఎల్‌సి ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఎల్‌సి పూర్తి అయిన ఈవిఎంలను మరో గోదాములో సురక్షితంగా భద్రపరుస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంల ఎఫ్ఎల్‌సి ప్రారంభించామన్నారు. ఈ మొత్తం ప్రక్రియను నవంబర్ 10 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ ప్రాంగణంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఎల్‌సి ప్రక్రియతో పాటు ఈ ప్రాంగణం మొత్తాన్ని సిసి కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ ప్రాంగణంలోకి అనుమతించటం లేని, ఎల్ఎఫ్‌సి పాల్గొంటున్న సిబ్బందికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులిచ్చి క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలికి అనుమతిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ ఆర్.శ్రీలత, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని

ఘనంగా నిర్వహించండి: జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 68వ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించటానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక జెసి ఛాంబర్‌లో సోమవారం నవంబర్ 1న జరిగే అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ ఒంగోలు సివిఎన్ రీడింగ్ రూం సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పించాలని, కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరణ అనంతరం స్పందన సమావేశ మందిరంలో సాంస్కృతిక వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో పాల్గొనే ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు పంపించాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఏఎస్‌పి అశోక్ బాబు, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, డిఎస్‌ఒ ఉదయ భాస్కర్ , డిఇఒ విఎస్ సుబ్బారావు, మెప్మా పీడీ టి.రవికుమార్, డిఐపిఆర్‌ఒ కె.గ్రేస్ లినోరా పాల్గొన్నారు.

తైక్వాండో విజేతకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం



ప్రశాంత్‌ను అభినందిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ బలిమెలలో 2008 సంవత్సరంలో మావోయిస్టులతో పోరాడుతూ అమరుడైన జూనియర్ కమాండెంట్ మోట ఆంజనేయులు (కొండెపి మండలం, పెరిదేపి గ్రామం) కుమారుడు యం.ప్రశాంత్ సౌత్ ఇండియా తైక్వాండో ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్, రాష్ట్ర, జాతీయ తైక్వాండో పోటీల్లో 8 పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో నేషనల్ తైక్వాండో ఫెడరేషన్ యూనియన్ వారిచే ఫస్ట్ డన్ సర్టిఫికెట్ పొందిన సందర్భంగా ఆయనను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్ ప్రత్యేకంగా అభినందించి, శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాన్ని మరియు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం గర్వించదగ్గ విషయమని, భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. రాబోయే పరీక్షలను దష్టిలో పెట్టుకొని తైక్వాండో లోనే కాకుండా చదువుల్లో కూడా రాణించాలని, కళాశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నేరుగా పోలీస్ శాఖ వారికి అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిఎస్‌బి డీఎస్పీ బి.మరియాదాసు, ఆర్‌ఐ హరిబాబు, అబ్బాయి తల్లి శ్రీదేవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అధికారుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

విధి నిర్వహణలో నీతి, నిజాయితీ, నిబద్ధతలనే అత్యున్నత ప్రమాణాలను పాటింపజేయడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ మలికగర్గ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు మరియు డీపీవో సిబ్బందితో 'నీతి నిజాయితీల ప్రతిజ్ఞ'ను సోమవారం చేయించారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతికి పెద్ద అవరోధంగా ఉన్న అవినీతిని నిర్మూలించటలో నీతి నిజాయితీలను నైతిక ప్రమాణాలతో జీవిస్తూ.. అవినీతికి దూరంగా ఉంటామని, నీతినిజాయితీల సంస్కతిని పెంపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డిఎస్‌బి డీఎస్పీ బి.మరియాదాసు, డీపీఓ ఏవో సులోచన, డిసిఆర్‌బి సిఐ ధర్మేంద్ర బాబు, ఐసిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ కె.అజయ్ కుమార్, ఆర్‌ఐలు హరిబాబు, శ్రీహరి రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలు గడువులోపు పరిష్కరించండి

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్
- స్పందనలో 325 అర్జీల దాఖలు
- డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన



స్పందనలో అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్, ఉన్నతాధికారులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్పందన అర్జీలను నిర్ణీత వ్యవధిలోగా కచ్చితంగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో "స్పందన", "డయల్ యువర్ కలెక్టర్ " కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సుమారు 325 అర్జీలు వచ్చాయన్నారు. ప్రజలు సంతప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీ కచ్చితంగా పరిష్కారమవ్వాలన్నారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమని చెప్పారు. పిటిషన్లు రీఓపెన్ కాకుండా చూడాలని ఆయన అన్నారు. సమస్యను పరిష్కరించలేకపోతే అందుకు ఉన్న కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

ముందుగా డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.

- కురిచేడు మండలం పెద్దవరం గ్రామం నుంచి జి. గురుస్వామి ఫోన్ చేసి సర్వీసు ఇనాం భూమి సర్వే నెం. 168-3 లోని తన 9.52 సెంట్ల భూమిని ఆక్రమించారని, న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కురిచేడు మండల తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.
- జరుగుమల్లి మండలం వాలేటిపాడు గ్రామం నుంచి జి.వెంకాయమ్మ ఫోన్ చేసి సర్వే నెం.166కు సంబంధించి ఎస్‌సి కాలనీకి స్థలాన్ని కేటాయించారని, విస్తీర్ణంలో తేడా ఉందని సరిచేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ సమస్యను వెంటనేపరిష్కరించాలని జరుగుమల్లి మండల తహశీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, గ్లోరియా, లోకేశ్వరరావు, వరకుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

1 నుంచి భవిష్యత్తుకు గ్యారెంటీ

- వైసిపి అవినీతిని ప్రజలకు వివరించాలి
- ఓటర్ల జాబితా మార్పులను గమనించాలి
- పార్టీ శ్రేణులకు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు దిశానిర్ధేశం



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నియోజకవర్గంలో నవంబర్ 1 నుంచి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం 45 రోజుల పాటు నిర్వహించాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు తెలిపారు. స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకొని వైసిపి అవినీతిని ప్రజలకు వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు. స్థానిక గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఒంగోలు నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం సోమవారం రాత్రి జరిగింది. కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి ప్రచారం నిర్వహించి నియోజకవర్గంలో ఉన్న స్థానిక సమస్యలు, వైసిపి అవినీతిపై ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం రచ్చబండ (ప్రజా వేదిక) కార్యక్రమం నిర్వహించాలని ఆయన సూచించారు. కొత్తగా వచ్చిన ఓటరు జాబితాను తప్పు, ఒప్పులను, మార్పులను గమనించి పరిశీలన చేసి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు పై మండలాలు, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు గ్యారంటీ బాండ్ వారికీ అందించేలా టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మంత్రి శ్రీనివాసరావు , వైవి సుబ్బారావు, కొఠారి నాగేశ్వరరావు, కామేపల్లి శ్రీనివాస రావు, కమ్మ వెంకటేశ్వర్లు, బండారు మదన్, కపిల్ బాషా పాల్గొన్నారు.

సత్వర న్యాయం చేసేందుకే 'స్పందన'

ఎస్పీ మలికగర్గ్



సమస్యలు వింటున్న ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ప్రజల నుండి వచ్చే పలు రకాల స్పందన ఫిర్యాదులను పరిష్కరించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీసు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల రాతపూర్వక అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి వారి ఫిర్యాదుల పూర్వాపరాలను వివరంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్పందన పిటిషన్ల పట్ల అధిక దష్టి సారించి పిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా కృషి చెయ్యాలని ఆదేశించారు. ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే, వాటిపై చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కారం అందించడానికి పోలీసుశాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని ఎస్పీ అన్నారు.

స్పందన ఫిర్యాదుల్లో కొన్ని.....

- తనకు వీఆర్వో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఒంగోలుకు చెందిన చెందిన షల్మా మరియు మరొక వ్యక్తి కలిసి రూ.10,00,000 తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసారని ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు.
- ఒంగోలు హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న తన ఇల్లును టీ.సుమన్ అనే వ్యక్తి అద్దెకు తీసుకుని సరిగా అద్దె చెల్లించటం లేదని, ఖాళీ చేయమంటే చెయ్యకుండా పలు విధాలుగా బెదిరిస్తున్నాడని ఒంగోలు మండలం, కొణిజేడు గ్రామానికి చెందిన ఒక మహిళ ఫిర్యాదు.

కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైమ్) యస్.వి.శ్రీధర్‌రావు, డిఎస్‌బి డీఎస్పీ బి.మరియాదాసు, ఒంగోలు ట్రాఫిక్ డిఎస్పీ వి.శ్రీనివాసరావు, దిశ డిఎస్పీ సిహెచ్. శ్రీనివాసరావు, ఐసిసిఆర్ ఇన్స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకష్ణ, స్పందన ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.